
# సిన్నర్ ముందంజ

## మూడో రౌండ్‌కు డిఫెండింగ్ చాంపియన్

- స్వియాటెక్, పలోని దూకుడు
- మెద్వెదెవ్ నిష్క్రమణ
- రెండో రౌండ్‌కు బాలాజీ ద్వయం





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఇటలీ కుర్రాడు యానిక్ సిన్నర్.. టైటిల్ నిలబెట్టుకునే దిశగా మరో ముందడుగు వేశాడు. గురువారం ఇక్కడి రాడ్‌లీవర్ ఎరీనాలో జరిగిన పురుషుల రెండో రౌండ్‌లో ఒకటో సీడ్ సిన్నర్ 4-6, 6-4, 6-1, 6-3తో ట్రిస్టన్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. గత మ్యాచ్‌లో అలవోకగా నెగ్గిన సిన్నర్ రెండో రౌండ్‌లో మాత్రం తొలి సెట్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత అతడి జోరుకు ట్రిస్టన్ తేలిపోయాడు. మ్యాచ్‌లో సిన్నర్ 14 ఏస్‌లు, 42 విన్నర్లు కొట్టాడు. టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా ఉన్న డేనియల్ మెద్వెదెవ్ 3-6, 6-7 (4/7), 7-6 (10/8), 6-1, 6-7 (7/10)తో లర్నర్ టియెన్(అమెరికా) చేతిలో అనూహ్య ఓటమి ఎదుర్కొన్నాడు. మిగిలిన మ్యాచ్‌లలో 17వ సీడ్ అమెరికా ఆటగాడు ఫ్రాన్సెస్ టియోఫి 7-6 (7/3), 4-6, 6-3, 4-6, 1-6తో ఫాబియన్ (హంగేరి) చేతిలో ఓడాడు. మరో అమెరికా కుర్రాడు టేలర్ ఫ్రిట్జ్ 6-2, 6-1, 6-0తో క్రిస్టియన్ గారియన్ (చిలీ)ను చిత్తు చేశాడు.

### స్వియాటెక్ జోరు

మహిళల సింగిల్స్‌లో పోలండ్ సంచలనం ఇగా స్వియాటెక్ జోరు కొనసాగిస్తోంది. రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6-0, 6-2తో రెబెక స్రమ్‌కొవ(స్లోవేకియా)పై అలవోక విజయం సాధించింది. తొలి సెట్‌ను 26 నిమిషాల్లోనే ముగించిన ఆమె ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా దక్కనివ్వలేదు. గంటా 9 నిమిషాల్లోనే స్వియాటెక్ మ్యాచ్‌ను గెలుచుకుంది. మూడో రౌండ్‌లో ఆమె బ్రిటన్ అమ్మాయి ఎమ్మా రదుకానుతో తలపడనుంది. నాలుగో సీడ్ జాస్మిన్ పాలోని (ఇటలీ)6-2, 6-3తో రెనట (మెక్సికో)పై గెలిచింది. ఆరో సీడ్ ఎలీనా రిబాకినా 6-0, 6-3తో ఇవా జోవిక్ (అమెరికా)ను చిత్తుచేసింది.

### రెండో రౌండ్‌కు బాలాజీ

ఆస్ట్రేలియా ఓపెన్‌లో భారత్ తరపున ఆటగాళ్లంతా ఒక్కొక్కరుగా తొలి రౌండ్‌లోనే వెనుదిరుగుతున్నప్పటికీ డబుల్స్ విభాగంలో శ్రీరామ్ బాలాజీ-రెయెస్ వరెల (మెక్సికో) జోడీ రెండో రౌండ్‌కు చేరింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఈ ఇండో-మెక్సికన్ జంట 6-4, 6-3తో రాబిన్ హాసె (డచ్)-అలెగ్జాండర్(కజకిస్థాన్) ద్వయాన్ని ఓడించింది.

### లాస్ ఏంజెల్స్ బాధితులకు ఫ్రిట్జ్ అండ..

మెల్‌బోర్న్: గత కొద్దిరోజులుగా యూఎస్‌ఏలోని లాస్ ఏంజెల్స్‌లో చెలరేగుతున్న కార్చిచ్చుతో వేలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్న నేపథ్యంలో ఆ బాధితులకు అమెరికా టెన్నిస్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్ అండగా నిలిచాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో తాను గెలవబోయే ప్రైజ్‌మనీని లాస్ ఏంజెల్స్ బాధితులకు అందజేయనున్నట్టు ఫ్రిట్జ్ తెలిపాడు. ఫ్రిట్జ్ కాలిఫోర్నియాలోనే పుట్టి పెరిగాడు. ఈ టోర్నీలో అతడితో పాటు పలువురు ఇతర ప్లేయర్లు సైతం లాస్ ఏంజెల్స్‌కు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

# ఫిబ్రవరిలో డబ్ల్యూపీఎల్

## నాలుగు నగరాల్లో నిర్వహణ కొత్తగా వడోదర, లక్నోకు అవకాశం ● ఫిబ్రవరి 14న మొదలు.. మార్చి 15న ఫైనల్

ముంబై: అమ్మాయిల ధనాధన్ క్రికెట్‌కు రంగం సిద్ధమైంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే నెల 14 నుంచి మార్చి 15 దాకా నెల రోజుల పాటు పొట్టి క్రికెట్ వినోదాన్ని డబ్ల్యూపీఎల్ అందించనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం డబ్ల్యూపీఎల్-3 షెడ్యూల్‌ను ప్రకటించింది. 20 లీగ్ మ్యాచ్‌లు, 2 నాకౌట్ మ్యాచ్‌లు (మొత్తం 22) జరుగబోయే ఈ మెగా టోర్నీని వడోదర, బెంగళూరు, లక్నో, ముంబై నగరాలలో నిర్వహించనున్నారు. గతేడాది ఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ టోర్నీని నిర్వహించగా తాజాగా ఢిల్లీ స్థానంలో వడోదర, లక్నో చేరాయి. ఫిబ్రవరి 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) గుజరాత్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది.

### వడోదరలో మొదలై.. ముంబైలో ముగిసి..

ఫిబ్రవరి 14న బరోడా (వడోదర)లో కొత్తగా నిర్మించిన బీసీఏ స్టేడియంలో తొలి ఆరు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఐదు జట్లూ ఇక్కడ నుంచే తమ టైటిల్ వేటను మొదలుపెడతాయి. ఫిబ్రవరి 21 నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యే ఈ టోర్నీలో మార్చి 1 వరకు 8 మ్యాచ్‌లు జరుగుతాయి. మార్చి 3 నుంచి 8 దాకా లక్నో.. 4 మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండగా 10 నుంచి టోర్నీ ముంబైలో జరుగుతుంది. ఆఖరి రెండు లీగ్ మ్యాచ్‌ల అనంతరం 13న ఎలిమినేటర్, 15న ఫైనల్ మ్యాచ్‌కు ముంబైలోని సీసీఐ స్టేడియం వేదిక కాబోతోంది. డబుల్ హెడర్స్, మధ్యాహ్నం మ్యాచ్‌లు ఏమీ లేని డబ్ల్యూపీఎల్-3లో మ్యాచ్‌లన్నీ రాత్రి 7:30 గంటల నుంచి మొదలవనున్నాయి.





## బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్

ముంబై: టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ కోచింగ్ సిబ్బందిలో మరో కొత్త కోచ్ చేరాడు. బ్యాటింగ్ కోచ్‌గా మాజీ ఆటగాడు, ఎన్‌సీఏలో లెవల్ 3 కోచ్‌గా సేవలందిస్తున్న సితాన్షు కోటక్‌ను బీసీసీఐ బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. గతంలో భారత 'ఏ' జట్టుతో పాటు రెండేండ్ల క్రితం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియాకూ ఆయన బ్యాటింగ్ కోచ్‌గా సేవలందించాడు. గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైఫల్యంతో పాటు ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భారత బ్యాటింగ్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 8 వేలకు పైగా పరుగులు చేసిన సితాన్షు.. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నుంచే బాధ్యతలు చేపట్టనున్నాడు.


# ప్రక్షాళన షురూ!

- మళ్లీ యోయో టెస్టు
- నిబంధనలు కఠినతరం
- హాట్‌హాట్‌గా బీసీసీఐ రివ్యూ మీటింగ్



ముంబై: గత నాలుగైదు నెలలుగా టెస్టులలో అత్యంత చెత్త ప్రదర్శన, ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తును దక్కించుకోవడంలో విఫలమవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు, సీనియర్ల పేలవ ఆటతీరు నేపథ్యంలో బీసీసీఐ జట్టులో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది! భారత జట్టు ఆస్ట్రేలియా నుంచి తిరిగొచ్చాక.. కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ గౌతం గంభీర్‌తో పాటు కొంత మంది బోర్డు ముఖ్యులతో బీసీసీఐ సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో గంభీర్.. జట్టు ప్రక్షాళనలో భాగంగా పలు కీలక సూచనలు చేసినట్టు బోర్డు వర్గాల సమాచారం. జట్టుతో పాటు ప్రయాణించే కుటుంబ సభ్యుల విషయంలో ప్రీ కోవిడ్ నిబంధనలను తీసుకురావాలని, డ్రెస్సింగ్ రూమ్ లీక్‌లను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గంభీర్ కీలక సూచనలు చేసినట్టు వినికిడి. క్రికెటర్ల భార్యలు, కుటుంబాలను రెండు వారాల కంటే (ఒక పర్యటన 45 రోజులు కంటే ఎక్కువ సాగితే) ఎక్కువ అనుమతించొద్దని, చిన్న పర్యటన అయితే వారానికే పరిమితం చేయాలని గంభీర్ పట్టుబట్టినట్టు తెలుస్తోంది. అంతేగాక జట్టు ఏదైనా టూర్‌కు వెళ్తే ఆటగాళ్లంతా టీమ్ బస్సులోనే ప్రయాణించాలని, ఏ ఆటగాడూ వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లకుండా నిబంధనలను కఠినతరం చేయాలని బీసీసీఐ యోచిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఆటగాళ్లు ప్రత్యేకంగా తీసుకెళ్లే హెయిర్ స్టయిలిస్టులు, వ్యక్తిగత వంటగాళ్లు, సెక్యూరిటీ సిబ్బందిపైనా నిషేధం పడనున్నట్టు సమాచారం. కోహ్లీ సారథిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన యోయో టెస్టును మళ్లీ తీసుకురానున్నట్టు వినికిడి. ఆటగాళ్లకు ఇచ్చే ఇన్సెంటివ్‌ల విషయంలోనూ బీసీసీఐ కొత్త విధించాలని భావిస్తున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. అంచనాలకు తగ్గట్టుగా రాణించడంతో పాటు దేశవాళీలో ఆడిన ప్లేయర్లకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశానికి హాజరైన ఓ సభ్యుడు సూచించాడు. ఇక గంభీర్ కోచింగ్ సిబ్బందిపైనా బోర్డు అసంతృప్తితో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. అసిస్టెంట్ కోచ్‌లు అభిషేక్ నాయర్, డస్కటె పనితీరుపై బీసీసీఐ అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇంగ్లండ్ సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీలో ఫలితాలు తేడా వస్తే వీరిపై వేటు వేయవచ్చన్న వాదనలూ వినిపిస్తున్నాయి.


## ఫైనల్‌కు విదర్భ



వడోదర: విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం వడోదరలో జరిగిన రెండో సెమీస్‌లో విదర్భ.. మహారాష్ట్రపై 69 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విదర్భ.. 50 ఓవర్లలో 380/3 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ధ్రువ్ (114), యశ్ (116) తొలి వికెట్‌కు 224 పరుగులు జోడించారు. సారథి కరుణ్ నాయర్ (88), జితేశ్ (51) రెచ్చిపోయి ఆడటంతో ఆ జట్టు భారీ స్కోరు చేసింది. అనంతరం ఛేదనలో మహారాష్ట్ర.. 50 ఓవర్లలో 311/7కే పరిమితమైంది. అర్షిన్ కులకర్ణి (90), అంకిత్ (50) పోరాడారు. ఈనెల 18న కర్నాటక, విదర్భ ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

## క్వార్టర్స్‌కు సింధు, కిరణ్

● సాత్విక్ జోడీ ముందంజ



ఢిల్లీ: ఇటీవలే వివాహ బంధంలోకి అడుగిడిన స్టార్ షట్లర్ పీవీ సింధు.. పెండ్లి తర్వాత ఆడుతున్న తొలి టోర్నీలో అదరగొడుతోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఇండియా ఓపెన్‌లో ఆమె క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సింధుతో పాటు పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి, భారత స్టార్ జోడీ సాత్విక్-చిరాగ్ సైతం క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్నారు. గురువారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు.. 21-15, 21-13తో జపాన్ అమ్మాయి మనామి సుయిజును ఓడించింది. మరోవైపు కిరణ్ 22-20, 21-13తో అలెక్స్‌ను ఓడించి క్వార్టర్స్ చేరుకున్నాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 20-22, 21-14, 21-16తో ఒకముర-మిసుహాషి (జపాన్)ను ఓడించింది.

## భారత్ జోరు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఖోఖో ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 71-34తో భూటాన్‌పై ఘన విజయం సాధించింది. దీంతో టాప్-ఏలో ఉన్న టీమ్‌ఇండియాకు క్వార్టర్స్ బెర్తు ఖాయమైంది. ఆది నుంచే తమదైన దూకుడు కొనసాగించిన భారత్ తొలి టర్న్‌లోనే 32 పాయింట్ల ఆధిక్యం ప్రదర్శించింది. అద్భుతమైన డైవింగ్ స్కిల్స్ ప్రదర్శించింది. మరోవైపు భారత మహిళల జట్టు 100-20తో మలేషియాను చిత్తుగా ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

## 5 కిలోల బియ్యం, బ్రష్‌లు, సబ్బులు..

- వాంఖడే స్వర్ణోత్సవ వేడుకలో
- గ్రౌండ్స్‌మెన్‌కు ఎంసీఏ బహుమానం

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్న బోర్డు బీసీసీఐ కాగా రాష్ర్టాల క్రికెట్ అసోసియేషన్‌ల పరంగా చూస్తే ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ)ది ప్రత్యేక స్థానం. దేశవాళీలో ముంబై జట్టుకు, అక్కడి ఆటగాళ్లకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సంపాదనపరంగా ఎంసీఏకు ఆదాయం తక్కువేమీ కాదు. ఇటీవలే ఎంసీఏ ప్రఖ్యాత వాంఖడే క్రికెట్ మైదానం స్వర్ణోత్సవ వేడుక సందర్భంగా.. స్టేడియం నిర్వహణను చూసుకునే గ్రౌండ్ సిబ్బందికి 'సత్కారం' పేరుతో ఎంసీఏ ఇచ్చిన బహుమతులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'జంబో గిఫ్ట్ హ్యాంపర్' పేరిట 178 మంది వాంఖడే సిబ్బందికి ఎంసీఏ పంపిణీ చేసిన ఆ కిట్‌లో.. ఐదు కిలోల బియ్యం, ఐదు కిలోల పప్పు, ఒక టీ షర్ట్, తువ్వాలు, పెన్నులు, సబ్బులు, కొబ్బరి నూనె, దువ్వెన, టూత్ బ్రష్, పేస్ట్, గొడుగు, బెడ్‌షీట్ వంటి కిరాణా కొట్టు సామాన్లున్నాయి. ఇది చూసిన సిబ్బంది అవాక్కై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# మూతబడ్డ హిండెన్‌బర్గ్

## షట్‌డౌన్ వెనుక కారణాలేంటి? అదానీ గ్రూప్‌పై రిపోర్టుతో సంచలనం




వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 16: హిండెన్‌బర్గ్ రిసెర్చ్ మూతబడింది. అదానీ గ్రూప్‌పై సంచలనాత్మక ఆరోపణలు చేసి ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్.. ఇక గుడ్‌బై అంటూ దుకాణం ఎత్తేసింది. హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకుడు నాథన్ అండర్సన్ గురువారం అధికారికంగా ప్రకటించారు మరి.

*మా దర్యాప్తు ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాయి. చివరి కేసును ముగించిన రోజే సంస్థనూ మూసేద్దామని గతంలోనే నిర్ణయించుకున్నాం. ఆ రోజే ఈ రోజు. మా రిసెర్చ్‌లతో కొన్ని సామ్రాజ్యాలు వణికిపోయాయి. దాదాపు 100 మందిపై రెగ్యులేటర్లు నేరాభియోగాల్ని నమోదు చేశారు. వీరిలో ఎందరో బిలియనీర్లు, సామ్రాజ్యాధినేతలూ ఉన్నారు. ఇక వచ్చే 6 నెలల్లో హిండెన్‌బర్గ్ ఇన్నాళ్లూ చేసిన దర్యాప్తులు, అందుకు వినియోగించిన సాధనాలపై సమగ్ర వీడియో కథనాల్ని రూపొందించే యోచనలో ఉన్నాం. తద్వారా మేము ఎలా దర్యాప్తుల్ని చేశామో ఇతరులూ చూసి నేర్చుకుంటారని ఆశిస్తున్నాం. నా జీవితంలో హిండెన్‌బర్గ్ ఓ గొప్ప అధ్యాయం. అయినప్పటికీ అదొక్కటే నా జీవితం కాదు. అందుకే నా వ్యక్తిగత జీవితానికీ ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నాను. ఇక ఇందులో పనిచేసిన ఉద్యోగులంతా ఎంతో సమర్థులు. ఎటువంటి భేషజాలు లేకుండా కలిసిమెలిసి పనిచేశారు. వారిని అభినందిస్తున్నాను.*

*-నాథన్ అండర్సన్, హిండెన్‌బర్గ్ రిసెర్చ్ వ్యవస్థాపకుడు*





### అదానీపై ఎక్కుపెట్టి..

ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీని వెనక్కినెట్టి.. అగ్రస్థానంలో నిలబడ్డ గౌతమ్ అదానీ ఒక్కసారిగా కూలబడ్డారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆయనకు చెందిన సంస్థల షేర్లన్నీ భీకర నష్టాల్లోకి జారుకున్నాయి. గంటల వ్యవధిలో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ హరించుకుపోయింది. లక్షల కోట్ల రూపాయల నష్టాలతో అదానీ వ్యక్తిగత సంపద కూడా కనుమరుగైపోయింది. భారతీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ రెండేండ్ల క్రితం విడుదలైన ఓ సంచలన నివేదికే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్లలో నమోదైన 10 అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ కేవలం నెల రోజుల్లోనే రూ.19.19 లక్షల కోట్ల నుంచి రూ.7 లక్షల కోట్లకు దిగజారింది. ఇందులో వ్యక్తిగతంగా గౌతమ్ అదానీకే దాదాపు రూ.9 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో ఈ రిపోర్టునిచ్చిన హిండెన్‌బర్గ్ పేరు దేశ, విదేశాల్లో మార్మోగిపోయింది. కాగా, హిండెన్‌బర్గ్ మూసివేత.. అదానీ, మోదీ సర్కారుకు క్లీన్‌చిట్‌గా భావించరాదని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అంటున్నది. మరోవైపు ఎందరో వచ్చారు.. ఎందరో పోయారు అంటూ అదానీ వ్యాఖ్యానించింది. అయితే స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ షేర్లు భారీ లాభాలను అందుకోవడం గమనార్హం.

### ఇదీ చరిత్ర..

హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను 2017లో నాథన్ అండర్సన్ ప్రారంభించారు. కనెక్టికట్ యూనివర్సిటీలో అంతర్జాతీయ వ్యాపార నిర్వహణ విద్యనభ్యసించిన ఆయన అమెరికాకు రాక ముందు జెరూసలేంలో ఉండేవారు. ఓ ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కన్సల్టింగ్ జాబ్‌ను చేసిన అండర్సన్.. కేవలం 11 మంది ఉద్యోగులతో ఇన్నాళ్లూ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కార్యకలాపాలను నడిపించడం గమనార్హం. కాగా, అమెరికాలోని లార్డ్స్‌టౌన్ మోటర్స్ కార్ప్, క్లోవర్ హెల్త్, చైనాకు చెందిన కాండీ, కొలంబియా సంస్థ టెక్నోగ్లాస్‌లపై గతంలో హిండెన్‌బర్గ్ రిపోర్టులు పేలాయి. 2023లో ఇకాన్ ఎంటర్‌ప్రైజెస్, బ్లాక్ కంపెనీలనూ షార్ట్ చేసింది. ఇక అదానీ గ్రూప్‌పై విధ్వంసం తెలిసిందే. అయితే అంతకుముందే భారత్‌కు చెందిన ఎరోస్ ఇంటర్నేషనల్ సంస్థపై హిండెన్‌బర్గ్ దాడులు జరిగాయి. టార్గెట్ కంపెనీల అక్రమాలు, అంతర్గత వ్యవహారాలు, లుకలుకల్ని కనిపెట్టి రిపోర్టులను సిద్ధం చేయడమే హిండెన్‌బర్గ్ పని. ఆ తర్వాత తమ భాగస్వాములతో కలిసి అదే సంస్థల్లో షార్ట్ పొజిషన్లు తీసుకుంటుంది. ఆపై సదరు రిపోర్టులను విడుదల చేస్తుంది. దీంతో స్టాక్ మార్కెట్లలో ఆయా కంపెనీల షేర్లు పడిపోగానే లాభాల్ని చేజిక్కించుకుంటుంది.

### విచారణల భయం..

అమెరికా ట్రేడెడ్ బాండ్లు, నాన్ ఇండియన్ ట్రేడెడ్ డెరివేటివ్ సాధనాల ద్వారా అదానీ గ్రూప్ సంస్థల్లో హిండెన్‌బర్గ్‌కు షార్ట్ పొజిషన్లున్నాయి. అదానీపై రిపోర్టుతో షార్ట్ సెల్లింగ్‌కు దిగి హిండెన్‌బర్గ్ బాగానే సంపాదించింది. కాగా, అదానీ గ్రూప్‌లోని వివిధ స్టాక్ మార్కెట్ నమోదిత కంపెనీల రుణం పెద్ద ఎత్తున ఉన్నదని, ఇది మొత్తం గ్రూప్ ఆర్థిక పరిపుష్టినే దెబ్బతీయగలదని హిండెన్‌బర్గ్ తమ రిపోర్టులో పేర్కొన్నది. ఈ క్రమంలో హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు ఇవ్వగా, అదానీ అక్రమాల్లో సెబీ చీఫ్ మాధవీపురి బచ్ దంపతుల పాత్ర కూడా ఉందంటూ ఆ సంస్థ సంచలన ఆరోపణలు చేసింది. ఇది దేశ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపింది. మరోవైపు అమెరికాలో అదానీపై కేసులు నమోదయ్యాయి. త్వరలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనుండటంతో దీనిపై గట్టిగానే విచారణలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిండెన్‌బర్గ్ షట్‌డౌన్ ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. విచారణల భయంతోనే మూసేశారా? అన్న సందేహాలూ తలెత్తుతున్నాయి.

# రిలయన్స్ లాభం 18,540 కోట్లు

## క్యూ3లో 7.4 శాతం పెరిగిన ప్రాఫిట్



*గత త్రైమాసికంలో రికార్డు స్థాయి ఎబిటా మార్జిన్లు ఆర్జించినట్లు, నికర లాభంలో కన్సాలిడేటెడ్ స్థాయికి చేరుకున్నది. డిజిటల్ సర్వీసులు, టెలికం సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లావడం కలిసొచ్చింది.*

*- ముకేశ్ అంబానీ, రిలయన్స్ సీఎండీ*

న్యూఢిల్లీ, జనవరి 16: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. రిటైల్ వ్యాపారంతోపాటు టెలికం విభాగం అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.18,540 కోట్లు లేదా ప్రతి షేరుకు రూ.13.70 చొప్పున ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.17,265 కోట్ల లాభం లేదా ప్రతిషేరుకు రూ.12.76తో పోలిస్తే సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.27 లక్షల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు ఎగబాకింది. రూ.3.5 లక్షల కోట్లకు చేరుకున్న రుణాలకోసం సంస్థ అధికంగా చెల్లింపులు జరపడం వల్లనే లాభాలు భారీగా పుంజుకోలేకపోయాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి కంపెనీకి రుణాలు రూ.3.36 లక్షల కోట్లు, ఏడాది క్రితం ఇదే త్రైమాసికం నాటికి రూ.3.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.

### జియో లాభంలో 24 శాతం వృద్ధి

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరోసారి భారీ లాభాలను ఆర్జించింది. గత త్రైమాసికపు లాభంలో 24 శాతం వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.6,231 కోట్లుగా ఉన్న స్టాండలోన్ నికర లాభం గత త్రైమాసికానికిగాను 24.24 శాతం ఎగబాకి రూ.6,477 కోట్లకు చేరుకున్నది. కంపెనీ ఆదాయం రూ.25,368 కోట్ల నుంచి రూ.29,307 కోట్లకు ఎగబాకింది. డాటా వినిమయం ఊపందుకోవడం, సరాసరిగా డాటాపై వచ్చే ఆదాయం పెరగడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 48.21 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. సరాసరి ఒక్కో కస్టమర్‌పై రూ.200 ఆదాయం సమకూరింది.

- రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లు ఆర్జించింది.
- గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం రిటైల్ స్టోర్ల సంఖ్య 19,102కి చేరుకున్నాయి.

## 81 వేలపైకి పుత్తడి

న్యూఢిల్లీ, జనవరి 16: బంగారం ధరలు మళ్లీ పరుగుపెడుతున్నాయి. ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, రూపాయి పతనం చెందడంతో పుత్తడి ధరలు రివ్వున ఎగిశాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.500 ఎగబాకి రూ.81,300కి చేరుకున్నది. దీంతో ఈ ధరలు రెండు నెలల గరిష్ఠ స్థాయిని తాకయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.2,300 ఎగబాకి రూ.94 వేలు పలికింది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 318.74 పాయింట్లు ఎగబాకి 77 వేలు అధిగమించి 77,042.82 వద్ద నిలువగా, నిఫ్టీ 98.50 పాయింట్లు అందుకొని 23,311.80 వద్ద నిలిచింది.

# ఈసారి జీడీపీ 6.4 శాతమే

## భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు ● గతంలో 7 శాతంగా అంచనా



న్యూఢిల్లీ, జనవరి 16: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతంగా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది.

### ఒడిదొడుకులు

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు మందగించవచ్చన్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

వాణిజ్య


## నష్టాల్లో రూపాయి

### మళ్లీ 21 పైసలు క్షీణత

### 86.61కి మారకం విలువ

ముంబై, జనవరి 16: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మళ్లీ క్షీణించింది. రికార్డు స్థాయిల నుంచి కోలుకున్నట్టే కనిపించినా.. గురువారం నష్టాలకే పరిమితమైంది. 21 పైసలు పడిపోయి 86.61కి చేరింది. అంతకుముందు రెండు రోజులు 30 పైసలు పెరిగిన విషయం తెలిసిందే. ఇక సోమవారం ఒక్కరోజే 66 పైసలు పతనమై మునుపెన్నడూ లేనివిధంగా 86.70గా నమోదైన సంగతి విదితమే. కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఎగబాకడం, విదేశీ పెట్టుబడులు దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతుండటం వంటివి రూపాయిని కూలదోశాయి.

# ఇన్ఫోసిస్ ఆశాజనకం





బెంగళూరు, జనవరి 16: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఐటీ సేవలకు డిమాండ్ ఊపందుకోవడం, వార్షిక విక్రయాల అంచనా మూడోసారి పెంచడం సంస్థకు కలిసొచ్చింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.6806 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.6,106 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధించింది. అలాగే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం అధికమై రూ.41,764 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో 4.5-5 శాతం వరకు పెరుగుదలవుండవచ్చునని గైడెన్స్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ..ఆర్థిక సేవలతోపాటు రిటైల్, కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ రంగంలో మార్పులు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధిలో అంచనాను సవరించినట్లు చెప్పారు. కంపెనీ మొత్తం ఆదాయంలో బీఎఫ్‌ఎస్‌ఐ నుంచి మూడోవంతు సమకూరుతున్నదని, అత్యధికంగా సమకూరుతున్న అమెరికాలో 6.1 శాతం వృద్ధిని కనబరిచినట్లు చెప్పారు.

- గత త్రైమాసికంలో 5,591 మంది ఉద్యోగులు జతయ్యారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,379కి చేరుకున్నారు.
- ప్రస్తుతేడాది 15 వేల మంది ఉద్యోగ నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని, వీరితోపాటు 20 వేల మంది ఫ్రెషర్లను సైతం తీసుకోబోతున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.